## క్లుప్తంగా

### ఆకస్మిక తనిఖీ చేసిన డీఈఓ



దేశ నమూనాను పరిశీలిస్తున్న డీఈఓ కమలకుమారి

రామచంద్రపురం రూరల్: హసన్‌బాద జెడ్పీ హైస్కూల్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారి కె.కమలకుమారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేసి, పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల ఆట స్థలంలో విద్యార్థులు రూపొందించిన దేశ నమూనాను పరిశీలించి, విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు, మూడో తరగతి విద్యార్థులు చేసిన శాస్త్రీయ నృత్యాలను తిలకించారు. ఆమె వెంట డీవైఈఓ ఎంఎల్ నరసింహఫణి, పాఠశాల హెచ్‌ఎం పీఎస్‌బీఎస్‌కే సుందరి ఉన్నారు.

### గొల్లపాలెంలో ఉచిత వైద్య శిబిరం



చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరి

కాజులూరు: గొల్లపాలెం పీఎస్ఎన్ మూర్తి కళాశాలలో శుక్రవారం జరిగిన ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి ఆనందరాయుడు, ఏడి వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు బిరుదా ఉమామహేశ్వరి, గైనకాలజిస్ట్ స్వాతిప్రియ తదితరులు కళాశాల, పాఠశాల విద్యార్థులకు, స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

### నేత్రదానం



చింతా రవీంద్రనాథ్ (ఫైల్)

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరం గ్రామానికి చెందిన చింతా రవీంద్రనాథ్(66) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. ఆయన కుటుంబ సభ్యులు చిన్నారి, రాజాచంద్రశేఖర్, రాజేంద్ర కుమార్, రజని, గ్రేస్, శాంతి ఆయన నేత్రాలను దానం చేయడానికి అంగీకరించారు. కాకినాడకు చెందిన ఐ-బ్యాంక్ సిబ్బంది వారికి గృహానికి చేరుకుని కార్నియాను సేకరించారు. రవీంద్ర కుటుంబ సభ్యులను పలువురు గ్రామస్తులు అభినందించారు.

### ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రమణ

కె.గంగవరం: దంగేరు శివారు కూనిమిల్లిపాడులో ప్రతి ఇంటికీ ప్రభుత్వ కుళాయి ఏర్పాటు చేస్తామని సర్పంచ్ కొప్పిశెట్టి రమణ అన్నారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా కూనిమిల్లిపాడులో జరుగుతున్న పైపులైన్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో త్వరలో అందరికీ తాగునీరు అందిస్తామన్నారు. దంగేరు శివారు గ్రామాల్లో కూడా ఈ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### పీఎంపీల సేవలు ప్రశంసనీయం



అంగర పీఎంపీ సమావేశంలో మాట్లాడుతున్న గంగుమళ్ల రాంబాబు

కపిలేశ్వరపురం: గ్రామీణ ప్రాంతాల్లోని క్షేత్ర స్థాయిలో ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్లు(పీఎంపీ) అందిస్తున్న వైద్య సేవలు ప్రసంశనీయమని పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం అంగరలో కార్తిక వన సమారాధన జరిగింది. మండలంలోని పీఎంపీలు కుటుంబ సభ్యులతో హాజరై సందడి చేశారు. సంఘం మండల కమిటీ అధ్యక్షుడు గంగుమళ్ళ రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన వైద్య సేవల సమీక్ష సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. మారుతున్న వైద్యరంగం తీరుకు అనుగుణంగా పీఎంపీలు తమ వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని రాజమహేంద్రవరానికి చెందిన డెల్టా హాస్పిటల్ న్యూరో వైద్య నిపుణుడు సుమంత్ మండవ అన్నారు. ఆధునిక వైద్య విధానంపై గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డా.రామ్‌గోపాల్ తేజ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బళ్లా శ్రీనివాసరావు, పి.దేవానంద్, కోన చిన్నారావు, పి.చిన్ని, కోన సత్యనారాయణ, సూరంపూడి వీరభద్రరావు పాల్గొన్నారు.

# శ్రమ దక్కే వేళ

- ఆర్‌బీకేల్లో జోరుగా ధాన్యం కొనుగోళ్లు
- అధికారుల నిరంతర పర్యవేక్షణ, త్వరితగతిన నగదు జమ
- దళారులను పక్కనబెట్టి, గిట్టుబాటు ధర పొందుతున్న రైతులు



కాజులూరులో ధాన్యం లోడు చేయించి రైతులకు రసీదులు అందజేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

కాజులూరు: వ్యవసాయ ఆధారితమైన రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల గ్రామాల్లో రైతులు అధికంగా వరి పంటనే సాగుచేస్తుంటారు. వరి పంట అంతా ఒకేసారి కోతకు రావటం, పంట దిగుబడి సమయంలో సరైన గిట్టుబాటు ధర లేకపోవటంతో అన్నదాతలు దళారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోయేవారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా, కొన్ని సాంకేతిక సమస్యల వల్ల వారు మరలా దళారులనే ఆశ్రయించాల్సి వచ్చేది. రైతుల సమస్యలను పూర్తిగా ఆకళింపు చేసుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల్లోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది.

**ఊపందుకున్న ధాన్యం విక్రయాలు**

గతంలో తూర్పుడెల్టా ఎగువ ప్రాంతమైన మండపేట, కడియం తదితర ప్రాంతాల్లో తొలకరి వరి నాట్లు ముందుగా ప్రారంభమయ్యేవి. ఈ ఏడాది కాలువ ఎగువ, దిగువన ఒకేసారి తొలకరి పనులు మొదలెట్టారు. దీంతో కాలువ శివారు భూములకు కాస్త సాగునీటి ఎద్దడి ఏర్పడి, సాగు ఆలస్యమైంది. ఫలితంగా వివిధ గ్రామాల్లో వరి మాసూళ్లకు తీవ్ర జాప్యం జరుగుతోంది. రైతులంతా ఒకేసారి మాసూళ్లు చేపట్టడంతో ధాన్యం విక్రయాలు ఊపందుకున్నాయి. ధాన్యం కొనుగోలులో లోడింగ్, అన్‌లోడింగ్ సకాలంలో జరగక, రవాణా సమస్యలు ఏర్పడటంతో పాటు, సంచుల కొరత తలెత్తింది. ప్రభుత్వం వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులను నిరంతరం గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంచి, వారి పర్యవేక్షణలో పనులను వేగవంతం చేస్తోంది. ట్రాక్టర్లకు జీపీఎస్ పెట్టడం ద్వారా లోడింగ్, అన్‌లోడింగ్ వేగవంతమయ్యాయి.

**ఆర్‌బీకేల్లోనే మద్దతు ధర**

ధాన్యం విక్రయానికి కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతుల నుంచి ఆర్‌బీకేల్లో టెక్నికల్ అసిస్టెంట్, వీపీఏలు శాంపిల్స్ సేకరిస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లోనే ఆన్‌లైన్ ప్రాసెస్ పూర్తిచేసి, ధాన్యాన్ని రైసుమిల్లులకు చేరవేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం 75 కేజీల బస్తాకు మద్దతు ధర రూ.1,637గా ప్రకటించింది. హమాలీ ఖర్చులు, రవాణా చార్జీలుగా రూ.36 చొప్పున ప్రభుత్వమే భరిస్తూ, రైతుకు మొత్తం రూ.1,673 చెల్లిస్తోంది. ఇప్పటికీ కొన్నిచోట్ల దళారులు రైతులను మభ్యపెట్టి 75 కేజీల బస్తా రూ.1,400కే కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్రయిస్తే ఇప్పట్లో సొమ్ము రాదని దళారులు రైతులను నమ్మించి, అయినకాడికి పట్టుకుపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోపే నగదు రైతు ఖాతాకు జమ చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. కొందరు రైతులకు ధాన్యం విక్రయించిన వారం రోజుల్లోగా నగదు జమ కావడంతో దీనిపై అపోహలు పూర్తిగా తొలగిపోయాయి. రామచంద్రపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు 50 శాతం కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యం విక్రయాలు జరిగాయి. ఒక్క కాజులూరులోనే సగటున తొలకరిలో 47 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో ఇప్పటి వరకు 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకాలు జరగ్గా, మిగిలిన ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని ఏఓ వి.అశోక్ తెలిపారు.



గొల్లపాలెంలో హమాలీలతో ధాన్యం తూకం వేయిస్తున్న రైతులు

#### సమాచారమిచ్చిన వెంటనే కొనుగోలు



ధాన్యం విక్రయించాలనుకునే వారు కొనుగోలు కేంద్రాల్లో సమాచారమిచ్చిన వెంటనే వీపీఏలు వచ్చి శాంపిల్ తీసుకువెళ్లారు. మరుసటి రోజే వారే హమాలీలను తీసుకువచ్చి ట్రాక్టర్లపై ధాన్యం తీసుకువెళ్లారు.

– కర్రి దుర్గారెడ్డి, రైతు, శలపాక

#### వారం రోజుల్లోనే నగదు జమ



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయిస్తే నెలలు గడచినా నగదు రాదని దళారులు రైతులను మభ్యపెడుతున్నారు. వారి మాటలు నమ్మకుండా నేను కొనుగోలు కేంద్రానికే ధాన్యం విక్రయించాను. ధాన్యం తరలించిన నాలుగు రోజుల్లోనే నా బ్యాంకు ఖాతాలో నగదు జమైంది.

– చిర్ల వెంకటరెడ్డి, రైతు, మొగలిపాలెం

#### కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



75 కేజీల బస్తాకు మద్దతు ధర రూ.1,637 చొప్పున ప్రభుత్వం ప్రకటించింది. ఇతర ఖర్చులకూ మరో రూ.36 ప్రభుత్వమే చెల్లిస్తోంది. దళారులు రైతులను భయపెట్టి 75 కేజీల బస్తా రూ.1,400కే కొంటున్నారు. నేను కొనుగోలు కేంద్రంలో విక్రయించటం వల్ల రూ.1,673 లభించాయి.

– పెంకే సత్యనారాయణ, రైతు, కాజులూరు

### వేణుగోపాలస్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణ



ప్రత్యేక అలంకరణలో నరసాపురపుపేట వేణుగోపాలస్వామివారు

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేటలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయం వద్ద కార్తిక ద్వాదశి సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో సుదర్శన చక్రం వేసి, ప్రత్యేక పూజలు చేశారు. కార్తిక ద్వాదశి నాడు దీపారాధన చేస్తే కార్తిక మాసమంతా దీపారాధన చేసిన ఫలితం వస్తుందని ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు భక్తులకు తెలిపారు. ఆలయ ఈఓ ఎంవీవీ సత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### విశ్వేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన



మామిడికుదురు: ఆదుర్రు గ్రామంలో ఉన్న సర్వమంగళ పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు పూజ్యం వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఈదరాడకు చెందిన పూజ్యం జగన్నాథశర్మ పర్యవేక్షణలో విశ్వేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. పార్వతీదేవికి కుంకుమార్చన నిర్వహించారు. ఉపాధ్యాయుల లక్ష్మీనర్సింహశర్మతో పాటు పలువురు భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు అన్నారు. గొల్లపాలెం-2 సచివాలయ పరిధిలో శుక్రవారం సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. గ్రామ సభలో ఏసురాజు, ఇతర నేతలు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గ్రామస్తులకు అందిన వివిధ పథకాల లబ్ధిని వివరించారు. టీడీపీ పాలనలో రుణమాఫీ అంటూ రైతులు, డ్వాక్రా మహిళలను మోసం చేశారని ఆరోపించారు. మరలా టీడీపీ, జనసేన నాయకులు బూటకపు వాగ్దానాలతో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అనంతరం పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ జొన్నకూటి పద్మాజ, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, ఆర్ఎంసీ డైరెక్టర్లు నల్లమిల్లి ఈశ్వరరెడ్డి, కాకతీయ రాజు, దండంగి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

**పట్టణాభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యం**

కపిలేశ్వరపురం: పట్టణాభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. మండపేట 7వ వార్డు పరిధిలో 'ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, మెండు బాపిరాజు, వార్డ్ ఇన్‌చార్జి గణేష్‌లు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వ పథకాలు ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ 14,16,17 వార్డుల పరిధిలో గత నాలుగున్నరేళ్లలో రూ.31.66 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేగుళ్ళ నారయ్యబాబు, పార్టీ నాయకులు ఓగిరాల దేవి, పసుమర్తి సురేష్, మేడిశెట్టి శ్రీనివాస్, మెండు నాగరాజు, శెట్టి నాగేశ్వరరావు, కొప్పిరెడ్డి కృష్ణ, మున్సిపల్ మేనేజర్ టి.కనకరాజు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**కోరుమిల్లిలో....**

కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లిలో ×ఆంధ్ర ప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే౯ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమాన్ని పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ సలాది అప్పారావు, మాజీ సర్పంచ్ సలాది వీరబాబు పాల్గొన్నారు.

**రాష్ట్రాభివృద్ధికి జగనే కావాలి**

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రాభివృద్ధికి జగనే కావాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు, పార్టీ యువజన నాయకుడు తోట పృథ్వీరాజ్ అన్నారు. మండపేట మండలం కేశవరం సచివాలయం- 03 పరిధిలో శుక్రవారం 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఎంపీపీ ఉండమట్ల వాసు, ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణ, పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కుటుంబాలు వారీగా ప్రభుత్వ లబ్ధి చేకూరిన విధానాన్ని వివరించారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేనంత స్థాయిలో సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. సాంకేతిక సమస్యలతో ఎవరికైనా ప్రభుత్వ లబ్ధి అందకపోతే వెంటనే సచివాలయ ఉద్యోగులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్‌ం జేసీఎస్ కన్వీనర్ బందెల సాయిరామ్, ఉప సర్పంచ్ వుండమట్ల నాగ తులసి, నాయకులు అల్లంపల్లి కిశోర్, గండిమేను గోవింద్, కూసు నరసింహమూర్తి, సమ్మతం పాపారావు, చంద్రమళ్ళ యేసయ్య పాల్గొన్నారు.

**నదురుబాదలో..**

రాయవరం: దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా నాలుగున్నరేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని, రానున్న ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నదురుబాదలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమంతో కూడిన డిజిటల్ బోర్డును ఆయన ఆవిష్కరించారు. అలాగే పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, మండల యూత్ కమిటీ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఏసురాజు



కోరుమిల్లిలో సంక్షేమ బోర్డులోని అంశాలను వివరిస్తున్న కార్యదర్శి, ప్రజాప్రతినిధులు



మండపేట పట్టణ పర్యటనలో మున్సిపల్ చైర్‌పర్సన్ నూక దుర్గారాణి



కేశవరం ఇంటింటి పర్యటనలో పృథ్వీరాజ్ తదితరులు



నదురుబాదలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన సర్పంచ్ చింతపల్లి, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు

### 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

పి.గన్నవరం: ప్రస్తుత సీజన్లో జిల్లాలో ఇంతవరకూ 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేశామని జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ వెల్లడించారు. మండలంలోని రాజులపాలెంలో శుక్రవారం ధాన్యం కల్లాల వద్ద రైతులతో ఆమె మాట్లాడారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం జి.పెదపూడిలోని రైస్ మిల్లులో ధాన్యం అన్‌లోడ్ విధానాన్ని పరిశీలించారు. ఆమె వెంట పి.గన్నవరం డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ ఉన్నారు.

# విద్య, క్రీడలకు సమ ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు



మ్యాచ్‌లో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఘనంగా బాస్కెట్‌బాల్ అంతర్ జిల్లాల పోటీలు ప్రారంభం
- ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహణ

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు, అదే స్థాయిలో క్రీడలకు సమ ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. 57వ స్కూల్ గేమ్స్ సమాఖ్య అంతర రాష్ట్ర బాస్కెట్ బాల్ పోటీలు శుక్రవారం రాయవరం జెడ్పీ హైస్కూల్లోని కాయల సూరారెడ్డి బాస్కెట్‌బాల్ క్రీడా ప్రాంగణంలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎం వీఎస్ సునీత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడారు. విద్యార్థులకు, యువతకు క్రీడలతో శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందన్నారు. అందుకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్ర పేరుతో గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ విభాగాల్లో క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, డీఈఓ ఎం.కమలకుమారి, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్తలు చింతా పాండురంగారెడ్డి, కాయల సూరారెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ, క్రీడలను ప్రోత్సహిస్తున్న పూర్వ విద్యార్థులు కాయల వెంకటరెడ్డి, సూరారెడ్డి బ్రదర్స్, చింతా పాండురంగారెడ్డి, అల్లూరి శ్రీనివాస చౌదరిలను ఎమ్మెల్సీ ఐవీ, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్‌ల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చింతా పాండురంగారెడ్డి బాస్కెట్‌బాల్ అంతర్ జిల్లా పోటీలకు రూ.4 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. తొలుతగా ఎమ్మెల్సీ ఐవీ, పృథ్వీ, డీఈవో కమలకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ తదితరులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, రామచంద్రపురం డీవైఈవో నరసింహ ఫణి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు పడాల కమలారెడ్డి, మంతెన అచ్యుతరామరాజు, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ పాల్గొన్నారు.

**పోటీలు ప్రారంభం**

అండర్-17 బాలురు, బాలికల అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బాలుర విభాగంలో తూర్పుగోదావరి- ప్రకాశం, కర్నూలు- విశాఖపట్నం, కృష్ణా-శ్రీకాకుళం, కడప-విజయనగరం జట్ల మధ్య జరిగిన పోటీల్లో తూర్పుగోదావరి, కర్నూలు, కృష్ణా, కడప జిల్లాలు విజయం సాధించాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం-కడప, పశ్చిమ గోదావరి-నెల్లూరు, విశాఖపట్నం-ప్రకాశం, కృష్ణా-కర్నూలు జిల్లాల జట్ల మధ్య జరిగిన పోటీల్లో శ్రీకాకుళం, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, కృష్ణా జిల్లాల జట్లు విజయం సాధించాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రి పూట కూడా పోటీలు నిర్వహిస్తున్నారు. రాయవరం పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాభిమానులు పోటీలను చూసేందుకు వచ్చారు.

# నరేంద్రపురంలో విష జ్వరాల విజృంభణ



జ్వర బాధితులతో మాట్లాడుతున్న దుర్గారావు దొర

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురం గ్రామంలో కొన్ని రోజులుగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. అనేక మంది జ్వరాలతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కొందరు అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించారు. వైద్యాధికారులు గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో డీఎంహెచ్ఓ దుర్గారావు దొర శుక్రవారం నరేంద్రపురం శివారు గుత్తులవారిపాలెంలో పర్యటించారు. అమలాపురంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొంది, ఇటీవల డిశ్చార్జి అయిన ఇద్దరు పేషెంట్లను ఆయన పరామర్శించారు. వారి ఇళ్ల పరిసరాల్లో చేపట్టిన దోమల నియంత్రణ చర్యలను పరిశీలించారు. ఎవరికైనా జ్వరాలొస్తే ప్రభుత్వాస్పత్రులకు రావాలని సూచించారు. అమలాపురం ఏరియా ఆస్పత్రి, కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం కింద డెంగీకి చికిత్స అందిస్తున్నారని చెప్పారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి భరతలక్ష్మి, వైద్యాధికారి మౌనికామణి, సబ్ యూనిట్ ఆఫీసర్ రాజశేఖర్, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.